
సాక్షి ఖమ్మం

మంగళవారం । 4 । మార్చి । 2025



సాగర్ ఆయకట్టుకు 'సీతారామ'

ఎన్నెస్పీ ఆయకట్టులో పంటలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 8లో



గరిష్టం / కనిష్టం
39° / 21°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం ఆదాయం రూ.7.62 లక్షలు



హుండీలో నగదు లెక్కిస్తున్న ఉద్యోగులు

కల్లూరు: మహాశివరాత్రి జాతర సందర్భంగా కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రంలో భక్తులు సమర్పించిన కానుకలతో పాటు ఇతరత్రా రూపాల్లో రూ.7,62,597 ఆదాయం నమోదైందని ఆలయ మేనేజర్ ఎస్వీడీ.ప్రసాద్ తెలిపారు. హుండీల్లో కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,81,470గా నమోదైందని వెల్లడించారు. అలాగే, వేలం పాటల ద్వారా రూ.2,93,300, దర్శనం, అభిషేకం టికెట్ల అమ్మకంతో రూ.1,30,727, జాయింట్ వీల్ నిర్వాహకుల నుంచి రూ.లక్ష, షాపుల అద్దె ద్వారా రూ.32,600, పార్కింగ్ నుంచి రూ.24,500 కలిపి మొత్తం రూ.7,62,597 ఆదాయం వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఇ.వెంకటేశ్వర్లు, అర్చకులు సురేష్‌శర్మ, ఆలయ చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్‌తో పాటు అబ్బూరి యుగంధర్, పెద్దబోయిన శివకృష్ణ, పెద్దబోయిన నరసింహారావు, కిష్టంశెట్టి ఏడుకొండలు, కిష్టంశెట్టి నర్సింహారావు, సాయిని రవి, పెద్దబోయిన విజయ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

13న పండితాపురం సంత వేలం పాట

కామేపల్లి: రాష్ట్రంలోనే పేరున్న కామేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధి శ్రీకృష్ణప్రసాద్ పశువుల సంత నిర్వహణకు ఈనెల 13న వేలం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టే ఈ వేలం సంత ఆవరణలో జరుగుతుందని వెల్లడిచారు. జీపీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని, ధరావత్ సొమ్ము రూ.30 లక్షలు, సాల్వెన్సీ కింద రూ.5లక్షలు చెల్లించి పాల్గొనాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ

ఖమ్మం సహకారనగర్: 2024–డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని బోధన మెరుగుపర్చుకోవాలని పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణ సూచించారు. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ పాఠశాలలో ఎస్జీటీలకు ఇస్తున్న శిక్షణను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ సబ్జెక్టులో కనీస అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా బోధన జరగాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుందని చెప్పారు. తొలుత ఎన్నెస్పీ కాలనీలో ఎఫ్ఎల్ఎన్ తీరు, డైట్ కళాశాలలో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. విద్యాశాఖ ఏఎంఓ రవికుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

1,345 ఫిర్యాదుల్లో 1,018 పరిష్కారం

ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎస్ఈ

ఖమ్మంవ్యవసాయం: ప్రజావాణిలో అందే ఫిర్యాదుల పరిష్కారానికి విద్యుత్ ఉద్యోగులు ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సూచించారు. ప్రజావాణిలో అందుతున్న ఫిర్యాదులు, పరిష్కారంపై ఆయన వివరాలు వెల్లడించారు. గత ఏడాది జూన్ 17న ప్రతీ సోమవారం సర్కిల్, డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ బిల్లులు, మీటర్ల సమస్యలు, సరఫరాలో హెచ్చుతగ్గులు తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 1,345 ఫిర్యాదులు అందగా, ఇందులో 1,018 సమస్యలను పరిష్కరించామని వెల్లడించారు. కాగా, ఉద్యోగులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని, ఇందుకోసం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్ఈ సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్ఈ

ఖమ్మం ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసాచారి సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్క అందజేయగా, పలు అంశాలపై మాట్లాడారు.

డబుల్ దందా..

జిల్లాలోని పలుచోట్ల ఇళ్ల స్థలాలు, విల్లాలు, ఇళ్ల డబుల్ రిజిస్ట్రేషన్ల దందా ఇటీవల పెరిగింది. కొందరు రియల్టర్లు అక్రమార్జనకు అలవాటు పడి ఈ బాట పడుతున్నారు. కొణిజర్ల మండలం ఇందోఖతార్‌లో డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారం వెలుగుచూడగా వైరా సబ్ రిజిస్ట్రార్‌తో పాటు తొమ్మిది మందిపై కేసు నమోదైంది. తాజాగా తప్పుడు డాక్యుమెంట్లు, డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురిపై ఆదివారం ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు రియల్టర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతుండగా, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు పలువురు వీరి వలలో చిక్కుకుని కేసుల పాలవుతున్నారు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం





పెరుగుతున్న నకిలీ డాక్యుమెంట్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు

- ధనార్జనే ధ్యేయంగా పలువురు రియల్టర్ల అడ్డదారులు
- రిజిస్ట్రేషన్ల శాఖలో వంత పాడుతున్న కొందరు అధికారులు
- ఫలితంగా భూయజమానుల్లో ఆందోళన

డబుల్ మాయ

రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయానికి ఎవరైనా రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయా, లేదా అని పరిశీలిస్తున్నారు. అయితే, గతంలో ఆ భూమికి రిజిస్ట్రేషన్ జరిగిందా అన్న అంశాన్ని మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీనిని ఆసరాగా తీసుకుంటున్న కేటుగాళ్లకు ఒకే భూమిని రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేయించడం సులువవుతోంది. వివాదాస్పద భూములకు ఇలా రెండేసి రిజిస్ట్రేషన్లు చేయిస్తుండడం.. ఇటీవల ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తుండడంతో భూయజమానులు కలవరానికి గురవుతున్నారు.

ఇదే వ్యాపారంగా..

జిల్లాలో కొందరు డబుల్ రిజిస్ట్రేషన్లతోపాటు తప్పుడు డాక్యుమెంట్లతో మోసాలకు పాల్పడుతున్నారు. భూములు లేకపోయినా తప్పుడు, డబుల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ద్వారా రుణాలు ఇప్పిస్తామంటూ అమాయకులను మోసం చేయడం పరిపాటిగా మారింది. భూముల క్రయవిక్రయాలు తగ్గిన నేపథ్యాన రియల్టర్లు అక్రమార్జనకు అలవాటు పడ్డారనే ప్రచారం జరుగుతోంది. ఖరీదైన భూములకు డాక్యుమెంట్లు సృష్టించి, వీటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. అంతేకాక డాక్యుమెంట్ల ఆధారంగా రుణాలు ఇప్పిస్తూ కమీషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇలాగే వ్యవహరించిన మధురానగర్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు షేక్ బడేసాహెబ్, చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన కొత్తపల్లి వెంకటేశ్వర్లు, తిప్పర్తి అశోక్‌కుమార్‌పై ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుకాగా.. పోలీసులు లోతైన విచారణ చేపట్టారు.

నాలుగు సార్లు రిజిస్ట్రేషన్

ఖమ్మం నగర అభివృద్ధితో శివారులోని మధురానగర్‌లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అయితే ఇక్కడ భూమి లేకున్నా ఒకే సర్వే నంబర్‌పై నాలుగు సార్లు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. తప్పుడు డాక్యుమెంట్లతో ఈ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసుల దృష్టికి వెళ్లడంతో అక్రమార్కుల బండారం బయటపడింది. అయితే, ఈ విషయాన్ని రిజిస్ట్రేషన్ సమయాన అధికారులు ఎందుకు గుర్తించలేకపోతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకవేళ తెలిసినా అధికారులు అక్రమార్కులకు వంత పాడుతున్నారా అన్నది తేలాల్సి ఉంది. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తుండడంతో త్వరలోనే సూత్రధారులెవరో తేలే అవకాశముంది.

కార్యాలయాల్లో ఎలా?

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు కొందరు మాయగాళ్ల వలలో చిక్కుకుని భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. అన్ని పత్రాలను పరిశీలించాకే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెబుతున్నా ఆ తర్వాత జరుగుతున్న పరిణామాలతో సస్పెన్షన్‌కు గురవుతున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. అయితే కొందరు అధికారులు మాత్రం రిజిస్ట్రేషన్లపై పూర్తి అవగాహన ఉన్నా ప్రలోభాలకు లొంగుతున్నారనే చర్చ జరుగుతోంది. గత ఏడాది డిసెంబర్‌లో వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకేరోజు 64 ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరగగా, విచారణ అనంతరం వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్యను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కొణిజర్లతోపాటు అమ్మపాలెం, లింగగూడెంలో డిసెంబర్ 28న గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ యజమానులు ఒకేరోజు 64 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించారు. వీటిలో గతంలోనే కొందరు కొనుగోలు చేసిన 80, 108, 134, 135 నంబర్ విల్లాలను సైతం ఈ సమయాన ఇతర పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదుతో విచారణ చేపట్టగా అక్రమంగా జరిగాయని నిర్ధారించారు. దీంతో వైరా సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు, తొమ్మిది మందిపై కేసు నమోదైంది.

సర్వం సన్నద్ధం





ఖమ్మం నయాబజార్ కాలేజీలో సీటింగ్ కేటాయిస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) సీసీ కెమెరాల పుటేజీ పరిశీలనకు సిద్ధం చేసిన మానిటర్

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- కేంద్రాన్ని గుర్తించేలా హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం మొదలుకానున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయగా ఎక్కడి నుంచైనా అధికారులు పర్యవేక్షించేందుకు వీలు కలగనుంది. అటు హైదరాబాద్, ఇటు జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి సీసీ కెమెరాల పుటేజీని ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. పరీక్ష కేంద్రం సామర్థ్యం ఆధారంగా ఐదు నుంచి పది వరకు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు.

గంట ముందు నుంచే అనుమతి

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లాలో 72కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 35 ప్రైవేట్ కళాశాలలు, ఒక ప్రైవేటు పాఠశాల, రెండు ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు 34 ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 36,660మంది పరీక్షలు రాయనున్నారు. కాగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 17,783 మందిలో జనరల్ 15,579మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,204మంది ఉన్నారు. ఇక ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,877మందిలో 16,632మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,245మంది ఉన్నారని అధికారులు వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించనుండగా విద్యార్థులను 8గంటల నుంచే అనుమతిస్తామని తెలిపారు.

పకడ్బందీగా జరిగేలా..

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హైపవర్ కమిటీ(హెచ్‌సీపీ), జిల్లాఎగ్జామినేషన్ కమిటీ(డీఈసీ)లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షల నిర్వహణకు నియమించిన 835మంది ఇన్విజిలేటర్లలో 300మంది అధ్యాపకులు, 535మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

సెంటర్ సులువుగా తెలిసేలా...

విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లు జారీ చేయగా ఇంకా అందని వారు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు tgbie. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్ తీసుకోవచ్చని అధికారులు సూచించారు. అంతేకాక సెంటర్ సులువుగా తెలిసేలా హాల్‌టికెట్‌పై సెంటర్ చిరునామాతో కూడా క్యూఆర్ కోడ్‌ను తొలిసారిగా ముద్రించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సెంటర్ చిరునామా గూగుల్ మ్యాప్ వస్తుందని అధికారులు తెలిపారు.

QR Code for Centre Loc

జిల్లాలో పరీక్షల వివరాలు...

చీఫ్ సూపరింటెండెంట్లు	72మంది
డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు	72మంది
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు	03
సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు	05
పరీక్షా కేంద్రాలు	72
విద్యార్థులు	36,660

అన్ని ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో 36,600మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానుండగా 72 కేంద్రాలు ఏర్పాటుచేశాం. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. హాల్ టికెట్ నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించగా, దానిపై సెంటర్ చిరునామా తెలుసుకునేలా క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. ఒకరోజు ముందుగానే కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకుని నిర్ణీత సమయానికి కంటే ముందుగానే చేరుకుని పరీక్ష ప్రశాంతంగా రాయాలి.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

నాలుగు గ్రామాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు

- రెండు జిల్లాల్లో రెండేసి గ్రామాల ఎంపిక
- మహిళా సంఘాల ద్వారా ఒక మెగావాట్ చొప్పున ప్లాంట్లు
- మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న శంకుస్థాపన



ఖమ్మంవ్యవసాయం: ప్రధాన మంత్రి కుసుమ్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని నాలుగు గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్రప్రభుత్వం సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుండగా, వ్యక్తిగతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి సబ్సిడీలు అందిస్తోంది. అలాగే, బంజరు, బీడు భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశమిస్తున్నారు. ఇదే సమయాన మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి ఆధ్వర్యాన ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో నాలుగు

పైలట్ ప్రాజెక్టుగా మహిళా సంఘాల ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈమేరకు ఖమ్మం జిల్లాలోని మధిర మండలం మడుపల్లి, కల్లూరు మండలం చిన్నకోరుకొండి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి, మణుగూరు మండలం ఉడతనేనిగుంపు గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్లు ఏర్పాటుచేశారు. ఇందుకోసం నాలుగెకరాల చొప్పున భూమి, నిర్మాణానికి రూ.3.50 కోట్ల నిధులు అవసరమని గుర్తించారు. ఇప్పటికే స్థలాలు ఖరారైనందున నివేదికలను రెడ్‌కో సంస్థ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు.

8న శంకుస్థాపన

రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటుచేసే సౌర విద్యుత్ ప్లాంట్లకు మహిళా దినోత్సవమైన ఈనెల 8న శంకుస్థాపన చేస్తారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనుండగా, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశముంది.

ఈ వారంలోనే శంకుస్థాపన

మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఏర్పాట్లు చేశాం. ఉమ్మడి జిల్లాలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నాలుగు ప్లాంట్లు తొలిదశలో ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాం. ఈ వారంలో శంకుస్థాపన జరిగే అవకాశముంది.

– పోలిశెట్టి అజయ్‌కుమార్, రెడ్‌కో మేనేజర్

ట్రాక్‌పైకి ట్రాక్టర్.. 'దురంతో'కు తప్పిన ముప్పు

చింతకాని: చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్‌కు లోకో పైలట్ అప్రమత్తతతో ముప్పు తప్పింది. రైలు సోమవారం మధ్యాహ్నం విజయవాడ దాటాక ఖమ్మం మార్గంలో వెళ్తుండగా చింతకాని మండలం రామకృష్ణాపురం రైల్వే గేట్ వద్ద ట్రాక్‌పైకి ట్రాక్టర్ వచ్చింది. ఈ మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండగా గేట్ వేయలేదు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ వచ్చినట్లు తెలుస్తుండగా, గమనించిన లోకో పైలట్ బ్రేకులు వేసి వేగాన్ని నియంత్రించాడు. ఈమేరకు గేటు వద్దకు రైలు వచ్చేసరికి ట్రాక్‌పై ఉన్న ట్రాక్టర్ ముందుకు వెళ్లిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనపై లోకో పైలట్ ఖమ్మం జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన దర్యాప్తు చేపట్టారు.

పరీక్షాకేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

ఖమ్మంక్రైం: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమల్లో ఉంటుందని సీపీ సునీల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట ఆంక్షలు అమల్లో ఉండనున్నందున 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా తిరగొద్దని, ఎలాంటి సభలు, ర్యాలీలు, మైక్‌లతో ఊరేగింపులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అంతేకాక కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సీపీ సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీపై ప్రచారం



టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచడమే కాకుండా ప్రభుత్వం 25 శాతం ఫీజు రాయితీ ఇస్తుందనే అంశంపై విస్తృత ప్రచారం చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. కేఎంసీ టౌన్‌ప్లానింగ్, సుడా అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ప్రణాళికాయుతంగా దరఖాస్తుల పరిశీలన చేపట్టాలని, చెరువులు, కుంటలు, నదుల ఎఫ్‌టీఎల్ పరిధి, ప్రభుత్వ భూముల్లో లేని ప్లాట్ల దరఖాస్తులకు సత్వరమే ఫీజు చెల్లించేలా అనుమతులు జారీ చేయాలని తెలిపారు. ఇకపై రోజుకు 15 మంది ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేలా పర్యవేక్షిస్తూ, వారికి రెండు రోజుల్లో ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో సుడా డీసీపీ రాజ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుంధర, టీపీఎస్‌లు పాల్గొన్నారు. అనంతరం ఆస్తి పన్ను వసూళ్లపై కేఎంసీ రెవెన్యూ అధికారులతో సమీక్షించిన కమిషనర్ ఈనెల 31 లోపు వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. కాగా, కేఎంసీ గ్రీవెన్స్‌లో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు..

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే(ప్రజావాణి)లో ఆయన పలువురి నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, ఏవైనా దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను తెలియచేయాలని సూచించారు. సత్తుపల్లి మండలం చెరుకుపల్లికి చెందిన తాటి రాములు సర్వే నంబర్ 113లో తన భూమిని గిరిజనేతరులు ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. అలాగే, ఖమ్మం ప్రకాశ్‌నగర్‌కు చెందిన సీ.హెచ్.విజయ్‌కుమార్ తనకు వ్యాపార నిమిత్తం రుణం మంజూరు చేయించడమే కాక మూడు చక్రాల ఎలక్ట్రిక్ వాహనం ఇప్పించాలని, కల్లూరుకు చెందిన ఎస్.సుజాత దివ్యాంగుల కోటాలో ఇరిగేషన్ కార్యాలయంలో స్వీపర్ పోస్ట్ ఇప్పించాలని కోరారు. ఇలా పలువురు వివిధ సమస్యలపై విన్నవించగా పరిష్కారంపై అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. తొలుత ప్రజావాణి దరఖాస్తుల నమోదు సెక్షన్‌కు వెళ్లి వివరాలు ఆరా తీశారు. అలాగే, చేయూత పెన్షన్ సహాయక కేంద్రాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈకార్యక్రమాల్లో డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా...



ఖమ్మం దివ్యాంగుల కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. నా కుమారుడు వినయ్‌కుమార్ అనారోగ్యం కారణంగా నేను ఏ పనికి వెళ్లలేకపోతున్నా. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నందున డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పించాలి. ఈ విషయంలో నాలుగేళ్లుగా తిరుగుతున్నందున స్పందించాలి.

– బత్తుల ధనలక్ష్మి, రమణగుట్ట, ఖమ్మం

ఎవరూ పట్టించుకోవడం లేదు..



నామవరం రెవెన్యూ పరిధిలో ఏడెకరాల భూమిని బంధువులు ఆక్రమించుకున్నారు. పదిహేనేళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తహసీల్, ఆర్డీఓ కార్యాలయాల్లోనే కాక కలెక్టరేట్‌లోనూ ఫిర్యాదు చేశా. భూమి నా పేరిట లేక నా కుటుంబీకులు సైతం పట్టించుకోవడం లేదు.

– చిలక సైదులు, నామవరం, చింతకాని మండలం

పంటలకు నీటి సరఫరాపై దృష్టి

యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలకు నీరందించేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆమె యాసంగి పంటలకు నీటి సరఫరా, గురుకులాల్లో తనిఖీలు, ప్లాస్టిక్ నిషేధంపై సమీక్షించారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రానున్న పది రోజులు అప్రమత్తంగా ఉంటూ చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూడాలని, ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఆటంకం ఎదురుకాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ కలెక్టరేట్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో స్త్రీ శక్తి టీ స్టాళ్లలో ప్లాస్టిక్ నిషేధించామని తెలిపారు. అలాగే, పంటలకు నీటి సరఫరా, విద్యుత్ అంతరాయాలు ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈసమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈలు వాసంతి, ఎం.వెంకటేశ్వర్లు, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి, డీఏఓ పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో రజతం


పవిత్రను అభినందిస్తున్న అదనపు కలెక్టర్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఉషూ టోర్నీలో ఖమ్మంకు చెందిన పి.పవిత్రాచారి రజత పతకం గెలుచుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ జేఎన్‌టీయూలో చదువుతున్న ఆమె చండీఘర్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఉషూ పోటీల్లో నాన్‌దావో ఈవెంట్‌లో ఫైనల్స్‌కు చేరింది. ఆతర్వాత హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో పవిత్రాచారికి ద్వితీయస్థానం దక్కించుకుంది. తెలంగాణ నుంచి పతకం దక్కించుకున్న క్రీడాకారిణి ఒక్కరే కావడం విశేషం. ఈసందర్భంగా ఆమెను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి సోమవారం అభినందించారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి..

కొణిజర్ల: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని జీవశాస్త్ర విభాగం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పెసర ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో భాగంగా బయాలజీ ఉపాధ్యాయులకు సోమవారం కొణిజర్ల సమీపంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఓరి యంటేషన్ నిర్వహించారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల బయాలజీ ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ సమావేశంలో ఖమ్మం, వైరా సహాయ సంక్షేమ అధికారులు సత్యవతి, జహీరుద్దీన్‌తో కలిసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి శ్రద్ధ కనబరిస్తే అందరితో పాటే మంచి మార్కులు సాధించే అవకాశముంటుందని తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో న్యాయమూర్తి


జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డితో ఎంపీడీఓ, తదితరులు

కూసుమంచి: మధిర అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి టి.కార్తీక్‌రెడ్డి సోమవారం కూసుమంచి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. శిక్షణలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ఆయన 'పంచాయతీరాజ్ శాఖ, సాధారణ పరిపాలన' అంశంపై ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డితో చర్చించారు. కాగా, మంగళ, బుధవారాల్లో ఆయన ఖమ్మం రూరల్ తహసీల్‌తో పాటు ఖమ్మం ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలను సందర్శించనున్నారు.

9న రవన్న వర్ధంతి సభ

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయనే నినాదంతో, మైదాన ప్రాంతంలో ఉద్యమ నిర్మాణానికి కృషి చేసిన రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9న రవన్న తొమ్మిదో వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని, రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సభలో రవన్న సాగించిన ఉద్యమాలపై సెమినార్ ఉంటుందన్నారు. ఈమేరకు ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రవన్న మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుర్రం అచ్చయ్య, కార్యదర్శి పుసులూరి నరేందర్ మాట్లాడగా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీ.వై.పుల్లయ్య, ఆవుల అశోక్, ఏ.వెంకన్న, బందెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు టి.ఝాన్సీ, కె.శ్రీనివాస్, ఎస్ ఆజాద్ పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన ప్రతిఘటన పోరాట యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) వర్ధంతిని ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, గొని ఐలయ్య తెలిపారు. ఖమ్మంలో సోమవారం వారు మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజన ప్రజానీకం సమస్యలపై పోరాడిన వ్యక్తి రవన్న అని పేర్కొన్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే ఆయన వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, నాయకులు బండారి ఐలయ్య, అరుణోదయ నాగన్న, డేవిడ్ కుమార్ పాల్గొన్నారు.

రూ.2.48 కోట్లకు ఐపీ

ఖమ్మం లీగల్: ఖమ్మంకు చెందిన కొదుమూరు శ్రీనివాసరావు రూ. 2,48,80,000కు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో సోమవారం దివాళా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. బియ్యం వ్యాపారం చేసిన ఆయన పలువురి వద్ద అప్పులు చేశాడు. ప్రస్తుతం అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ 64మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాదులు కోనా చంద్రశేఖర్‌గుప్తా, పి.శరణ్య, పి.సాయికిరణ్ ద్వారా కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేశాడు.

సాగర్ ఆయకట్టుకు 'సీతారామ' నీరు

ప్రాజెక్టుతో రెండు జిల్లాలు సస్యశ్యామలం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


అశ్వాపురం : బీజీ కొత్తూరులో పంప్‌హౌస్ ద్వారా విడుదలవుతున్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు

అశ్వాపురం/ములకలపల్లి: నాగార్జునసాగర్ ఆయకట్టులో పంటలు ఎండిపోకుండా గోదావరిలో ఉన్న కొద్దిపాటి జలాలను సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అందించనున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్టతో పాటు బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ ఫేస్ -1 పంప్‌హౌస్, ములకలపల్లి మండలంలోని వీ.కే.రామవరం, కమలాపురంలోని పంప్‌హౌస్‌లను సోమవారం మంత్రి పరిశీలించి మాట్లాడారు. గోదావరిలో ఉన్న కొద్దిపాటి జలాలను సాగర్ ఆయకట్టు పరిరక్షణకు కేటాయిస్తున్నామని చెప్పారు. అశ్వాపురం, ములకలపల్లి మండలాల్లోని పంప్‌హౌస్‌ల ద్వారా 100 కి.మీ. మేర గోదావరి జలాలు ప్రవహించి రాజీవ్ కెనాల్ నుంచి సాగర్ కెనాల్‌కు మంగళవారం సాయంత్రానికి చేరతాయని తెలిపారు. తద్వారా సాగర్ చివరి ఆయకట్టు ఎంబీసీ మధిర బ్రాంచ్ కెనాల్, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాల చివరి ఆయకట్టుకు సాగర్ జలాలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. ఈకార్యక్రమాల్లో పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నీటి పారుదల ఎస్ఈలు శ్రీనివాసరెడ్డి, రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్‌తో పాటు నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుక్కాని మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిగువకు గోదావరి జలాలు

ములకలపల్లి మండలం కమలాపురం సీతారామ పంప్‌హౌస్- 3 నుంచి గోదావరి జలాలు దిగువకు తరలాయి. ఇక్కడ మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోయగా, గ్రావిటీ ద్వారా ఏన్కూరు లింక్ కెనాల్‌కు వెళ్లాయి. సోమవారం రాత్రి 8గంటల సమయాన నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగింది. మంగళవారం సాయంత్రంలోగా గోదావరి జలాలను సాగర్ కాల్వలో కలుపుతామని మంత్రి తుమ్మల ప్రకటించిన నేపథ్యాన అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు.

ఇంకా జాడ లేని చారి..

- పరారీలోనే లింగ నిర్ధారణ పరీక్షల కేసులో ప్రధాన నిందితుడు
- రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు

చింతకాని: వాహనంలో తిరుగుతూ అనుమతి లేకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠాలో కీలక నిందితుడైన ఖమ్మం బల్లేపల్లికి చెందిన చారి జాడ ఇంకా తెలియరాలేదు. కారులో తిరుగుతూ గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠా సభ్యులు ఇద్దరు చింతకాని మండలం కొదుమూరులో ఇటీవల పట్టుబడ్డారు. వీరి నుంచి వాహనం, స్కానింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకోగా కీలక నిందితుడైన చారి ఆచూకీ కోసం పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. ఆయన పట్టుబడితే ముఠాకు సహకరించిన వారెవరనే అంశంలో కీలక విషయాలు బయటపడతాయని భావిస్తున్నారు.

ఇద్దరు ఆర్ఎంపీలు.. ఒక అసిస్టెంట్

బల్లేపల్లికి చెందిన చారి గతంలో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పీఆర్‌ఓగా పనిచేసి, ఆతర్వాత గ్రామీణ వైద్యుడిగా కొంతకాలం పనిచేశాడు. ఈక్రమంలోనే చింతకాని మండలం కొదుమూరుకు చెందిన ఆర్ఎం రాచబంటి మనోజ్‌తో ఆయనకు పరిచయం ఏర్పడింది. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌కు రోగులను తీసుకెళ్లే క్రమాన అక్కడ స్కానింగ్ అసిస్టెంట్, ఖమ్మం అల్లీపురానికి చెందిన కాత్యాయిని పరిచయం కావడంతో ముగ్గురు త్వరగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో సెకండ్ హ్యాండ్ కారు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఆపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని పలు గ్రామాలకు వెళ్లి మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి రూ.10వేల నుంచి రూ.15వేలు వసూలు చేసేవారు. గర్భంలో ఉన్నది ఆడా, మగా అని నిర్ధారించడంతో ఆడశిశువు వద్దనుకుంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో గర్భస్రావం చేయించి కమీషన్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే వీరి కదలికలపై నిఘా వేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత గురువారం మనోజ్ స్వగ్రామమైన కొదుమూరులో ముగ్గురికి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయాన మనోజ్, కాత్యాయినిని అదుపులోకి తీసుకోవడంతో స్కానింగ్ యంత్రం, కారును సీజ్ చేశారు. కేసులో ప్రధాన నిందితుడైన చారి మాత్రం ఇప్పటివరకు పట్టుబడకపోగా, రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసులు జాప్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎస్సై నాగుల్‌మీరాను వివరణ కోరగా పరారీలో ఉన్న చారి ఆచూకీని కనుగొనేందుకు రెండు బృందాలచే గాలింపు చేపడుతున్నామని తెలిపారు. ఆయన పట్టుబడితే పూర్తి వివరాలు బయటపడతాయని పేర్కొన్నారు.

కాపర్ వైర్ చోరీ

వేంసూరు: మండలంలోని చౌడవరంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు రూ.8వేల విలువైన కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని అల్లు లక్ష్మీ నరసింహారెడ్డి ఆయిల్‌పామ్ తోటలో ఈ ఘటన జరిగింది. ఈమేరకు విద్యుత్ శాఖ ఏఈ అంకురావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వరిగడ్డి వామి దగ్ధం

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురంలో మాజీ జెడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రంకు చెందిన వరిగడ్డి వామికి సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేశారు. అయితే, అప్పటికే రూ.70వేల విలువైన 500 దిండ్లు కాలిపోయాయని దేవేంద్రం వాపోయారు.

యువకుడి ఆత్మహత్య కేసులో వ్యక్తి అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన జోనబోయిన వెంకటేష్ ఆత్మహత్య కేసులో ఇదే మండలం కోటపాడుకు చెందిన భట్టా నాగేశ్వరరావును సోమవారం అరెస్ట్ చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. చిమ్మపుడికి చెందిన పాపయ్య కుమారుడు వెంకటేష్‌ను నాగేశ్వరరావు అసభ్యకరంగా దూషించడంతో మనస్తాపానికి గురై డిసెంబర్ 13న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు పాపయ్య ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

సైలో బంకర్ బాధితుల దీక్షలో నాయకులు


దీక్షలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: సింగరేణి గనుల నుంచి బొగ్గు తరలింపునకు సత్తుపల్లి మండలంలో ఏర్పాటుచేసిన సైలోబంకర్ ద్వారా వెలువడే కాలుష్యంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమల విఠల్ అన్నారు. సైలో బంకర్‌ను తొలగించాలని కిష్టారం అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ వాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 22వ రోజుకు చేరగా వారు మాట్లాడారు. బంకర్ తొలగించే వరకు దీక్షలు ఆపొద్దని, బాధితులకు తాము అండగా నిలుస్తామని ప్రకటించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే, ఎంపీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాజిరి శ్రీనివాస్, గుడిమెట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు 600 మందితో పాదయాత్ర

సైలోబంకర్‌ను తొలగించాలనే డిమాండ్‌తో 22వ రోజులుగా దీక్షలు చేపడుతున్నా యాజమాన్యం స్పందించకపోవడంతో బాధితులు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం 600 మంది కిష్టారం నుంచి సత్తుపల్లి వరకు కాలినడకన వెళ్లి అక్కడ తహసీల్‌లో వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

హీటర్ ఆన్ చేస్తుండగా షాక్‌తో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి పరిధి ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2కు చెందిన బండారి వెంకటేశ్వర్లు(54) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. ఆయన ఉదయం ఇంట్లో వాటర్ హీటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కన్నుమూశాడు. ఆ సమయాన ఇంట్లో ఎవరూ లేకపోగా, ఖమ్మం వెళ్లిన వారు వచ్చేసరికి కిచెన్ రూంలో విగతజీవిగా పడి ఉండడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంకటేశ్వర్లు కుమారుడు వినయ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ...


భాస్కర్ (ఫైల్)

పెనుబల్లి: మండలంలోని ఎడ్ల బంజర్‌లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రోజువారీ కూలీ ఇమ్మడి భాస్కర్(55) మృతి చెందాడు. రహదారిపై నడిచి వెళ్తున్న ఆయన రోడ్డు దాటుతుండగా కొత్తగూడెం నుండి వీఎం బంజర వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను స్థానికులు పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలికి వీఎం బంజర పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

గుండెపోటుతో జమలాపురం ఆలయ అర్చకుడు...


సుదర్శన్‌శాస్త్రి (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ అర్చకులు ఉప్పల సుదర్శన్‌శాస్త్రి (59) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. నిత్య పూజల్లో కీలకంగా వ్యవహరించే ఆయన మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. ఈమేరకు సుదర్శన్‌శాస్త్రి మృతదేహం వద్ద ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ విజయ కుమారి తదితరులు నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్: ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడిన వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన బేతిని సత్యం(55) ఈనెల 1వ తేదీన తన ఇంటి ఆవరణలోని చింత చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో ఆయన వెన్నుపూస, చేతికి బలమైన గాయాలయ్యాయి. ఈమేరకు స్థానికంగా చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్కెట్‌కు లక్ష బస్తాల మిర్చి


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు సోమవారం భారీగా మిర్చి తీసుకొచ్చారు. మహాశివరాత్రి, అమావాస్య, వారాంతపు సెలవుల అనంతరం మార్కెట్‌లో క్రయవిక్రయాలు మొదలుకాగా దాదాపు లక్ష బస్తాల మిర్చి విక్రయానికి వచ్చింది. ఉమ్మడి జిల్లాతో పాటు వరంగల్, నల్ల గొండ, కరీంనగర్, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కూడా రైతులు మిర్చి తీసుకొచ్చారు. గతనెల 24 సోమవారం 1.20 లక్షల మిర్చి బస్తాల రాగా, సోమవారం కూడా లక్ష బస్తాల మేర తీసుకురావడంతో మార్కెట్‌లోని యార్డులు, షెడ్లు నిండిపోయాయి.

ధరలో కనిపించని పురోగతి

మిర్చి విక్రయాలు జోరుగా సాగుతున్నా ధరలో పురోగతి కానరావడం లేదు. నెల రోజులుగా ధర ఏ మాత్రం పెరగకపోవడం గమనార్హం. సోమవారం జెండాపాట రూ. 14,100, మోడల్ ధర రూ.13,800గా నమోదవగా కనిష్ఠ ధర రూ.5,500గా పలికింది. ఇక తాలు మిర్చికి గరిష్ఠంగా రూ.6 వేలు, రూ.5వేల ధర నమోదైంది. స్థానికంగా మిర్చి ఆయిల్ ఫ్యాక్టరీలకు కొనుగోళ్లు పెరిగే పంట ధర కాస్త పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

మిర్చిబోర్డు ఏర్పాటు చేయాల్సిందే..

అఖిలపక్షం ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ఆందోళన


కలెక్టరేట్ వద్ద ధర్నాలో అఖిలపక్షం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోనే అత్యధికంగా మిర్చి క్రయవిక్రయాలు జరిగే ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేసి క్వింటాకు రూ.25వేల చొప్పున ధర చెల్లించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. పెట్టుబడులు పెరిగి, తెగుళ్లతో దిగుబడి తగ్గి రైతులు ఆందోళన చెందుతుండగా, వ్యాపారులు ధరలు తగ్గిస్తుండడంతో మరింత నష్టం ఎదురవుతోందని చెప్పారు. ఈమేరకు సోమవారం సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలు, అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించగా నాయకులు మాట్లాడారు. గతేడాది క్వింటాకు రూ.20వేల ధర పలకగా, ఇప్పుడు రూ.12 వేల నుంచి రూ.13వేల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఖమ్మంలో అత్యధికంగా మిర్చి సాగవుతుండడమే కాక క్రయవిక్రయాలు ఇక్కడే ఎక్కువగా జరుగుతున్నందున మిర్చిబోర్డు ఏర్పాటుచేసి, ప్రభుత్వ సంస్థల ద్వారా క్వింటా రూ.25వేల చొప్పున కొనుగోలు చేసేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బానోత్ చంద్రావతి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్‌రావు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, అడపా రామకోటయ్య, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, పగడాల నాగరాజు, పుచ్చకాయల సుధాకర్, బాగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ధర్నా అనంతరం నాయకులు కలెక్టర్‌ను కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని ఐదుగురిని మాత్రం అనుమతించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి

- రెండో ప్రాధాన్యత ఓట్లతో వరించిన విజయం
- సిట్టింగ్ ఎమ్మెల్సీపై 5,521 ఓట్ల మెజారిటీ


ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఖమ్మం - వరంగల్ - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ-టీఎస్ బలపరిచిన అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై 5,521 ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందారు. ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 8,448 ఓట్లు వచ్చాయి. అయితే నర్సిరెడ్డి ఎలిమినేట్ కాకముందు గెలుపు కోటా ఓట్లు శ్రీపాల్‌రెడ్డికి కూడా లేకపోవడంతో నర్సిరెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో.. శ్రీపాల్‌రెడ్డికి వచ్చిన 2,870 రెండో ప్రాధాన్యత ఓట్లు కలిపారు. దీంతో శ్రీపాల్‌రెడ్డి 13,969 ఓట్లు సాధించగా గెలుపు ఖరారైంది.

ఉదయం 7గంటల నుంచి కౌంటింగ్..

ఎన్నికల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఆర్జాల బావిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో సోమవారం నిర్వహించారు. ఉదయం 7గంటలకు ప్రక్రియ మొదలుకాగా, ఉదయం 11 గంటల వరకు బండిల్స్ కట్టాక లెక్కింపు చేపట్టారు. సాయంత్రం 3గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయింది. మొత్తం 24,135 ఓట్లు పోల్ కాగా 494 ఓట్లు చెల్లలేదు. ఇక 23,641 ఓట్లు చెల్లుబాటు కాగా, ఇందులో సగానికి మించి ఒక్క ఓటు కలిపి 11,821గా గెలుపు కోటా ఓటును నిర్ణయించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో శ్రీపాల్‌రెడ్డి అత్యధికంగా 6,035 ఓట్లు రావడం, గెలుపు కోటాకు సరిపోకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కించారు. చివరకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతోనే శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. కాగా, లెక్కింపులో ఒక్కో రౌండ్ పూర్తవుతుండగా ఉత్కంఠ నెలకొంది. శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యంలో ఉన్నా.. ద్వితీయ స్థానంలో ఉన్న నర్సిరెడ్డికి చేరువలో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి రాగా లిగినా సుందర్‌రాజు ఎలిమినేషన్‌తో ఇద్దరి మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడింది. ఆ తర్వాత పులి సరోత్తం రెడ్డి, పూల రవీందర్, గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఓట్లు లెక్కించారు. అప్పటికి కూడా గెలుపు కోటా రాకపోవడంతో నర్సిరెడ్డిని కూడా ఎలిమినేషన్ చేసి ఓట్లు లెక్కించారు. అయినా కోటా రాకపోయినప్పటికీ శ్రీపాల్‌రెడ్డి గెలిచినట్లుగా అధికారులు ప్రకటించారు.


విజయం అనంతరం శ్రీపాల్‌రెడ్డి

ఎలిమినేషన్‌లో ఓట్లు పెరిగాయి ఇలా..

మొదటి ప్రాధాన్యతలో ప్రధాన అభ్యర్థులైన పింగలి శ్రీపాల్‌రెడ్డికి 6,035 ఓట్లు రాగా, అలుగుబెల్లి నర్సిరెడ్డికి 4,820 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి 4,437 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత పూల రవీందర్‌కు 3,115, బీజేపీ బలపర్చిన అభ్యర్థి సరోత్తంరెడ్డికి 2,289, సుందర్‌రాజుకు 2,040 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ఇలా 14వ రౌండ్ వరకు ఎలిమినేషన్ చేస్తూ ఓట్ల లెక్కింపు చేయగా శ్రీపాల్‌రెడ్డికి అప్పటి వరకు 6,165 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 4,946 ఓట్లు వచ్చాయి. హర్షవర్ధన్‌రెడ్డికి 4,596 ఓట్లు, పూల రవీందర్‌కు 3,249 ఓట్లు వచ్చాయి. అంటే.. 14వ రౌండ్‌వరకు ఎలిమినేట్ అయిన అభ్యర్థుల నుంచి మరో 130 రెండో ప్రాధాన్యత ఓట్లు శ్రీపాల్‌రెడ్డికి లభించాయి. ఈ రౌండ్ తరువాత సుందర్‌రాజును ఎలిమినేట్ చేసి ఓట్లు లెక్కింపు చేపట్టారు. ఈమేరకు 15వ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి ఒక్కసారే 781 ఓట్లు పెరిగి 6,916కి చేరాయి. రెండోస్థానంలో ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి కూడా 5,205 ఓట్లకు చేరుకున్నారు. మిగతా వారికి కూడా ఓట్లు పెరిగినప్పటికీ శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యం కొనసాగింది. ఇక 16వ రౌండ్‌లో పులి సరోత్తంరెడ్డి, 17వ రౌండ్‌లో పూల రవీందర్, 18వ రౌండ్‌లో హర్షవర్ధన్‌రెడ్డిని ఎలిమినేట్ చేశారు. అప్పటికి శ్రీపాల్‌రెడ్డి ఓట్లు 11,099కు, నర్సిరెడ్డి ఓట్లు 8,448కు చేరాయి. దీంతో నర్సిరెడ్డిని సైతం ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో శ్రీపాల్‌డ్డికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఈమేరకు 2,870 ఓట్లు కలిపి శ్రీపాల్‌రెడ్డి 13,969 ఓట్లు సాధించడంతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు.

పీఆర్‌టీయూ నేతల సంబురాలు..


సంబురాల్లో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించగా సోమవారం రాత్రి ఖమ్మంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నాయకులు కట్టా శేఖర్‌రావు, కూరాకుల సైదయ్య, గుత్తా శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రాయల నర్సింహరావు, పుసులూరి శ్రీనివాసరావు, షఫీ, వెంకన్న, వీరయ్య చౌదరి, నరేందర్, తాళ్లూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలతోనే ముందడుగు


బహుమతులు అందుకున్న విదార్థులతో మోహన్‌రావు, తదితరులు

ఖమ్మం సహకారనగర్: కొత్త ఆవిష్కరణలతోనే సైన్స్ రంగంలో అభివృద్ధి సాధ్యమవుతుందని.. ఈవిషయంలో శాస్త్రవేత్తలు ఎంతో కృషి చేస్తున్నారని తెలంగాణ అకాడమీ సైన్సెస్ అధ్యక్షుడు, సీసీఎండీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు తెలిపారు. ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన సైన్స్ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. దైనందిన జీవితంలో సైన్స్‌కు ప్రాముఖ్యత పెరిగిందని.. ఎందరో శాస్త్రవేత్తలు తమ ఆవిష్కరణలతో మానవాళికి మేలు చేశారని తెలిపారు. తెలంగాణ అకాడమీ సైన్సెస్ వరంగల్ జోన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, ఎస్ఆర్ఆర్ మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వి.సాంబశివరావు మాట్లాడగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎం.నిరంజన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణా రావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్.ఆంజనేయులు, ఐక్యూఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఎర్రుపాలెం: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కోగంటి సాయిరాం(29) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న ఆయన ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనపై సాయిరాం తల్లి రమాదేవి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వెంకటేశ్ తెలిపారు.